క్లుప్తంగా

సిరిమాను చెట్టు తరలింపు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ: మండల కేంద్రంలోఎల్లమాంబ సిరిమానోత్సవానికి సంబంధించిన సిరిమాను చెట్టును గింజేరు గ్రామంలోని ఈడుకు రాంబాబు, తౌడు కళ్లం వద్ద గుర్తించారు. మంగళవారం ఆ చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సిరిమాను చెట్టును నరికి గంట్యాడకు తరలించారు. సర్పంచ్ రాజన్న సూరిబాబు, ఉప సర్పంచ్ రాజన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమసింగిలో నేత్రవైద్యశిబిరం



శిబిరంలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో శంకర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ జె.వెంకటలక్ష్మి సహకారంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ శ్రీకాంత్, ఇతర వైద్య సిబ్బంది సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నామని శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో–ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ మురళి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఏ.వేదవతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేతనదారులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పని చేస్తే ప్రభుత్వం రోజుకు నిర్దేశించిన గరిష్ట వేతనం రూ.250 అందుతుందని చెప్పారు. పనులకు ఒకరికి బదులు వేరొకరు హాజరు కాకూడదని అన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఆమె వెంట ఏపీఓ బి.కృష్ణవేణి ఉన్నారు.

కాలువ తవ్వకాలకు సహకరించండి




రైతులతో చర్చిస్తున్న ఎస్‌డీసీ సుదర్శన దొర

గుర్ల: మండలంలోని నాగళ్లవలసలో తోటపల్లి కాలువ నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని ఎస్‌డీసీ సుదర్శనదొర కోరారు. నాగళ్లవలస సచివాలయంలో గ్రామస్తులు, రైతులతో మంగళవారం ఆ యన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కాలువకు సేకరించిన భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. కాలువ నిర్మాణ పనులను రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని, పనులకు ఆటంకం కలిగించవద్దని కోరారు. తహసీల్దార్ పద్మావతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

వేపాడ: స్థానిక ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, కార్యదర్శి రమణ నేతృత్వంలో మండల కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా టర్కీ భూకంప మృతులు, కామ్రేడ్ ఎస్.నాగయ్య మృతికి సంతాపం ప్రకటించి, నివాళులర్పించారు. అనంతరం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శరవేగంగా బ్రిడ్జి నిర్మాణం



దాదాపు పూర్తికావచ్చిన బ్రిడ్జి నిర్మాణం

గజపతినగరం: మండల కేంద్రంలో చంపావతినదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాత బ్రిడ్జికి సమీపంలో రూ.17 కోట్లతో కొత్త వంతెన నిర్మిస్తున్నారు. దాదాపు పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తికావస్తుండడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక శోభ

కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నాలుగురోజుల పాటు నిర్వహించనున్న సీతారామచంద్రస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాలు గురుదేవా చారిటబుల్ ట్రస్టు, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. అంతకు ముందు 1,021 కళశాలతో (ఏకోత్తర సహస్ర కలశవాహన)మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికలు, దేవతామూర్తుల వేషధారణతో సందడి చేశారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తదితరులు ఏర్పాట్లు చేశారు.

– కొత్తవలస రూరల్



సహస్ర కలశాలతో మహిళల ఊరేగింపు



ఊరేగింపులో దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సైక్లింగ్‌తో ఆరోగ్యం



జామి: సైక్లింగ్ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



శృంగవరపుకోట: తలారిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు



వేపాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

జామి: సైక్లింగ్‌తో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ అన్నారు. మండల కేంద్రంలో ఆయుష్ భారత్‌లో భాగంగా సైకిల్‌ఫర్ హెల్త్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ఉన్నతపాఠశాల వరకు వైద్య సిబ్బంది సైకిల్ ర్యాలీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక బరువును నియంత్రించవచ్చని తెలిపారు. ఒత్తిడిని తగ్గించడానికి, రక్తపో టు నియంత్రణకు, క్యాన్సర్, దీర్ఘకాలిక రోగాల నియంత్రణకు వ్యాయామం సహాయపడు తుందని, సైక్లింగ్ ఒక మంచి వ్యాయామమని చెప్పారు.

శృంగవరపుకోట: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో పీహెచ్‌సీల వైద్యసిబ్బంది నేతృత్వంలో సైక్లింగ్‌తో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తిమిడి గ్రామంలో డాక్టర్ సతీష్ నేతృత్వంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సర్పంచ్ త్రినాథమ్మ, సతీష్, వెంకటరావు, తలారిలో డాక్టర్ లావణ్య, హారిక సూచనలతో హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రంధి అనంత్, రామసత్యం పాల్గొన్నారు. అలాగే వేపాడలో పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి నేతృత్వంలో విద్యార్థులతో కలిసిర్యాలీ నిర్వహించారు.

పుల్వామా అమరవీరులకు నివాళులు



శృంగవరపుకోట: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు

జామి: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు భీమసింగి బాలాజీ జూనియర్,డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ బాలమురళి ఆధ్వర్యంలో వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది భారత జవాన్లు అమరులయ్యారని, దేశం కోసం వారు చేసిన ప్రాణత్యాగాన్ని భారతీయులు ఎప్పటికీ మరచిపోరని బాలమురళి అన్నారు. కళాశాల కరస్పాండెంట్ సూర్యారావు, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎస్.కోటలో కొవ్వొత్తుల ర్యాలీ

శృంగవరపుకోట: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు అంజలి ఘటిస్తూ స్థానిక వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు మంగళవారం సాయంత్రం ఎస్.కోట పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఎస్.కోట ఎస్ఐ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జామి: వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న బాలాజీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

18న కృష్ణమ్మ తల్లి ఉత్సవాలు

బొండపల్లి: కొత్తపాలెం గ్రామంలో ఈనెల 18న శివరాత్రిని పురస్కరించుకుని కృష్ణమ్మ తల్లి పేరంటాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు, కబడ్డీ, వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

శృంగవరపుకోట: పెరిగిన శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. కేశవరావు సూచించారు. కళాశాలలో మంగళవారం యూట్యూబ్ ఫౌండేషన్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దంలో యూట్యూబ్ శాస్త్రసాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. యూట్యూబ్‌లో ప్రసారమయ్యే పాఠ్యాంశాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని, పోటీ పరీక్షలకు కావాల్సిన అంశాలను యూ ట్యూబ్ ద్వారా సేకరించాలని వివరించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న, గ్రీన్ అంబాసిడర్లు, ఏఐటీయూసీ నాయకులు

గుర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీఓ కల్యాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, మండల అధ్యక్షుడు పూడిరాజు పాల్గొన్నారు.

రాస్తారోకో

శృంగవరపుకోట: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌పై కృష్ణా యూనివర్సిటీలో పోలీసులు దాడిని ఖండిస్తూ స్థానిక దేవీ జంక్షన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు నేతృత్వంలో మంగళవారం రాస్తారోకో చేశారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పనులు పూర్తికాని భవనాల్లో క్లాసులు నడిపి ఇద్దరు విద్యార్థులు విద్యుత్ షాక్‌కి గురైతే, వారికి న్యాయం చేయమని శాంతియుతంగా అడుగుతున్న ఎస్ఎఫ్ఐ నేతలపై పోలీసులు దాడికి తెగబడటం న్యాయమా అని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడికి పాల్పడ్డ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నవధాన్యాల సాగు–నేలతల్లి బాగు



రైతులకు అవగాహన కలిగిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గజపతినగరం రూరల్: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెంది, జీవవైవిధ్యం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం సబ్‌డివిజన్ శిక్షకులు బి.సత్యనారాయణ అన్నారు. కాలంరాజుపేట గ్రామంలో సర్పంచ్ గేదెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నవధాన్యాలసాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఖరీఫ్ వరి నాట్లు వేసే పొలంలో 45 రోజుల ముందు నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని, సూక్ష్మజీవులు వృద్ధి చెంది సహజ పద్ధతిలో పంటకు పోషకాలు అందుతాయని సత్యనారాయణ అన్నారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రావాలమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు



మహిళ కోలాటం

వేపాడ: మండలంలోని భోజంకివానిపాలెం గ్రామదేవత రావాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, సర్పంచ్ బి.రామునాయుడు దర్శించుకున్నారు.

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు



అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ అరుణ

గజపతినగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని మండలంలో పటిష్టంగా అమలు చేసి, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికార యంత్రాంగం సహాయ సహకారాలు అందించాలని తహసీల్దార్ ఎం.అరుణకుమారి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్ కుమార్, ఎస్ఐ గంగరాజు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం, ఈఓపీఆర్డీ జనార్దనరావు తదితర అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయించాలని ఆదేశించారు. ఆలయాలు, మసీదులు, ప్రార్థనా మందిరాల్లో ఎన్నికల సభలు,సమావేశాలపై నిషేధం ఉందని చెప్పారు. ఓటర్లను ప్రలోభపెట్టినా, ఎక్కువ మంది గుమిగూడి చర్చలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చురుగ్గా బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసనాయుడు, తదితరులు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ఆవరణలో రక్త నిల్వ కేంద్ర(బ్లడ్ బ్యాంక్) భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సీహెచ్‌సీలో అధిక సంఖ్యలో గర్భిణుల ప్రసవాలు, రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులతో పాటు రోజూ వందల సంఖ్యలో ఓపీ నమోదవుతుంటుంది. అత్యవసర సమయాల్లో రక్తం కోసం జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి చొరవతో ఇక్కడ రక్త నిల్వ కేంద్ర భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.60 లక్షలు సమకూర్చింది. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మంగళవారం పరిశీలించారు.

సమగ్ర భూరీసర్వేపై ఆరా



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా భూసర్వే ఏడీ త్రివిక్రమరావు

దత్తిరాజేరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన సమగ్ర భూసర్వేపై జిల్లా భూసర్వే ఏడీ త్రివిక్రమరావు రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మండలంలో తొలివిడతగా ఏడు గ్రామాల్లో పూర్తయిన సర్వేపై తహసీల్దార్ రమేష్, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ సర్వేపూర్తయిన గ్రామాల్లో వన్‌బీల్లో ఏవైనా తప్పులు దొర్లితే రైతుల కోరినమేరకు సవరించాలని సూచించారు. రెండో విడతకు ఎంపికైన గ్రామాల్లో త్వరగా ఆయా గ్రామాల హద్దులను ముందుగా గుర్తించి సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. రైతుల సమక్షంలో సర్వే చేయాలని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ సత్యవంతుడు అన్నారు. మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో గ్రామైఖ్య సంఘం నూతన కమిటీ ఎంపిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను, ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక ప్రోత్సాహాన్ని సద్వినియోగించుకోవాలని అన్నారు. చిరువ్యాపారాలు, ఇతర జీవనోపాధులు కల్పించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సర్పంచ్ ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న బాలభాస్కరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల లెసెన్ ప్లానింగ్, డైరీ, టీచింగ్ మెటీరియల్, వసతులను పరిశీలించారు. తరగతుల వారీగా విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పథకం నిర్వాహకులకు సూచించారు.

తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీలు

బొండపల్లి: మండలంలోని చందకపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి–26పై మంగళవారం వేకువ జామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరోలారీ ఢీకొట్టింది. ఒడిసాలోని దుర్గ్ నుంచి ఐరన్ ఓర్‌తో వెళుతున్న లారీని చందకపేట గ్రామానికి సమీపంలో రోడ్డు పక్కన నిలిపివేయగా..అదే మార్గంలో ఒడిసాలోని రాయగడ నుంచి కాకినాడ పోర్టుకు బియ్యం లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో లారీలు రెండూ నుజ్జు,నుజ్జు అయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు లారీలను పక్కకు తొలగించారు. అదృష్టవశాత్తు రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లు, క్లీనర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.